

పటిష్టంగా 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ' అమలు : కలెక్టర్

ప్రజాశక్తి - కడప : ఇక నుండి ప్రతి సోమవారమూ 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ' ద్వారా ప్రజల నుండి వినతులు, ఫిర్యాదులను స్వీకరించే కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ వి.విజయ్ రామరాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 24న నుంచి ప్రతి సోమవారమూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలోని ప్రజా ఫిర్యాదుల స్వీకరణ వేదిక ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని చెప్పారు. అలాగే ఆయా శాఖల అధికారులందరూ తమ పరిధిలోని అర్జీలను 'మీకోసం' వెబ్ సైట్ పోర్టల్లో అప్లోడ్ చేయాలని సూచించారు. జిల్లాస్థాయి అధికారులందరూ 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'ను అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందజేసి 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

రాజంపేట టిడిపిలో అంతర్మథనం

- ముగ్గురి వెన్నుపోటే ఓటమికి కారణమా?!
- ఓటమికి గల కారణాలు సిఎంకు సుగవాసి ఏకరువు
- టిడిపి మండలాల్లో వైసిపి మెజార్టీపై సీరియస్
- లోపాయికారీ మద్దతుదారుల గుట్టురట్టు
- త్వరలో సస్పెన్షన్లకు అవకాశం?

రాజంపేట టిడిపిలో అంతర్మథనం కొనసాగుతోంది. టిడిపి తరుపున అసెంబ్లీ బరిలో నిలిచిన సుగవాసి బాలసుబ్రమణ్యం ఓటమికి గల కారణాలపై మేథోమథనం జరుగుతోంది. ఉమ్మడి కడప జిల్లాలో టిడిపి గెలుపునకు అవకాశాలు కలిగిన అసెంబ్లీ స్థానాల్లో రాజంపేట ముందువరుసలో నిలిచిన సంగతి తెలిసిందే. టిడిపికి అనుకూలంగా వీచిన బలమైన గాలిలో రాజంపేటలో టిడిపి ఓటమి పాలు కావడాన్ని టిడిపి నాయకత్వం జీర్ణించుకోలేకపోతోంది. టిడిపి మెజార్టీ సాధించే మండలాల్లో వైసిపికి మెజార్టీ రావడానికి వెన్నుపోట్లే కారణమనే వాదన వినిపిస్తోంది. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో ఓటమి పాలైన అభ్యర్థులతో సమావేశంలో పార్టీ ఓటమికి గల కారణాలను ఆరా తీసినట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో గెలుపునకు ముందువరుసలో ఉన్న రాజంపేటలో ఓటమికి వెన్నుపోటు పాడిచిన గుర్రైన నాయకులపై సస్పెన్షన్ వేటుపడే అవకాశాలు ఉన్నాయనే వాదన వినిపిస్తోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రాజంపేట టిడిపి సంస్థాగత సమస్యతో సతమతమవుతోంది. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో బరిలో నిలిచిన సుగవాసి బాల సుబ్రమణ్యం ఓటమికి గల కారణాలపై ఆరా తీస్తోంది. ఇందుకు ముగ్గురు నాయకుల వెన్నుపోటే కారణమనే అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి ఓటమి పాలైన సంగతి తెలిసిందే. వైసిపి కేడర్ టిడిపి శ్రేణులపై సాగించిన దాడుల స్వైర విహారాన్ని తట్టుకుని శ్రేణులను కాపాడుకునే ప్రయత్నాలను అప్పటి ఇన్ఛార్జి సమర్థవంతంగా నిర్వహించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట పార్లమెంట్ టికెట్ను కూటమి తరుపున బిజెపికి కేటాయించాల్సిన పరిస్థితుల నేపథ్యంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా రాజంపేట అసెంబ్లీ టికెట్ను సుగవాసి కుటుంబానికి కేటాయించడంతో అసంతృప్తి బుసలుకొట్టింది. సుగవాసికి గట్టి రాజకీయ నేపథ్యం ఉన్న సంగతి తెలిసిందే. ఇటువంటి కుటుంబాన్ని రాజకీయంగా కుదురుకోకుండా చేయాలనే ఉద్దేశంతో ముగ్గురు టిడిపి, అసంతృప్త నాయకులు తెరవెనుక చక్రం తిప్పి ఓటమి పాలు చేశారనే వాదన వినిపిస్తోంది.

స్వయంకృతరాధం లేదంటారా?

రాజంపేటలో టిడిపి ఓటమికి స్వయంకృతాపరాథమనే భిన్నమైన వాదనలు వినిపిస్తున్నాయి. వైసిపి సమిష్టి నాయకత్వంలో డబ్బుల పంపిణీ దగ్గర నుంచి నాయకులను కలుపుకొనిపోవడంలోనూ సమర్థవంతంగా వ్యవహరించిన సంగతిని ఉదహరిస్తుండడం గమనార్హం. సరిగ్గా ఇక్కడే టిడిపి అభ్యర్థి విఫలమయ్యారనే వాదన వినిపిస్తోంది. వైసిపి అసమ్మతి నేత నుంచి బలమైన వ్యతిరేకతను తట్టుకుని నిలబడేందుకు గల అవకాశాలను పరిశీలించింది. టిడిపి ప్రత్యర్థి నుంచి వచ్చిన బలమైన అనుచరులను సమర్థవంతంగా ఉపయోగించుకోలేకపోవడాన్ని స్వీయ తప్పిదంగా గుర్తించాల్సిన అవసరం ఉంది. ఓటమిని వెన్నుపోట్లపై నెట్టడాన్ని మినహాయించి చూడాలి. ఇందులో తనవంతు లోపమేమిటనేది ఆత్మ పరిశీలన చేసుకోవాలి.

టిడిపి మండలాల్లో వైసిపి పాగా

రాజంపేట అసెంబ్లీ పరిధిలో రాజంపేట, నందలూరు, సుండుపల్లి, వీరబల్లి, ఒంటిమిట్ట, సిద్ధవటం మండలాలు ఉన్నాయి. టిడిపికి సుండుపల్లి, సిద్ధవటం, రాజంపేట, నందలూరు మండలాలు బలమైన మద్దతును కలిగి ఉన్న సంగతి తెలిసిందే. 2019 మినహా మిగిలిన ఎన్నికల్లో టిడిపి స్పష్టమైన ఆధిక్యతను కొనసాగిస్తూ వస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా టిడిపికి బలమైన గాలివీచిన పరిస్థితుల్లో 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైసిపికి లభించిన మెజార్టీ రావాలి. లేనిపక్షంలో టిడిపికి మద్దతు కలిగిన మండలాల్లోనైనా మెజార్టీ లభించి ఉండాలి. ఇటువంటి మండలాల్లో వైసిపికి మెజార్టీ రావడం వెనుక ఎవరి హస్తం ఉందనే అంశం చర్చనీ యాంశంగా మారింది. అసెంబ్లీలోని బూత్ల వారీగా రాబిన్సింగ్ టీముకు స్పష్టమైన అవగాహన కలిగి ఉంది. రాజంపేట, రాయచోటి, రైల్వేకోడూరు ప్రాంతాలకు చెందిన కీలక నాయకుల పనితీరుపై సందేహాలు వ్యక్తమవుతున్నట్లు తెలుస్తోంది. ఐదేళ్లుగా వైసిపి అరాచక దాడులను తట్టుకుని నలిగిపోయిన కేడర్ను నిలువునా ముంచిన నాయకత్వంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

ఓటమిపై చంద్రబాబు ఆరా

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజయవాడలో రాష్ట్ర వ్యాప్తంగా ఓటమి పాలైన అభ్యర్థులతో ఇటీవల సమీక్షించిన సంగతి తెలిసిందే. పార్టీ ఓటమికి గల కారణాలపై ఆరా తీసినట్లు తెలుస్తోంది. రాజంపేటలో టిడిపి ఓటమికి వెన్ను పోట్లే కారణమనే సమాచారం అందినట్లు పార్టీ వర్గాల అభిజ్ఞ. ఇందుకు బాధ్యులు ఎవరనే కోణంలో ఆరా తీసే ప్రయత్నాలు చేపట్టినట్లు తెలుస్తోంది. సర్వేబృందాలు, పార్టీ అంతర్గత బృందాలు, ఇంటెలిజెన్స్ ఇతర మార్గాల ద్వారా సమాచారం సేకరిస్తున్నట్లు సమాచారం. వివిధ సంస్థల సమాచారం ఆధారంగా నిర్ధారణకు రానున్నట్లు తెలుస్తోంది. అనంతరం వెన్నుపోటుదారులను సస్పెండ్ చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

వైఎస్ఆర్ జిల్లా పేరులో కడపను చేర్చాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నేతల డిమాండ్



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్

ప్రజాశక్తి -కడప అర్బన్

వైఎస్ఆర్ జిల్లా పేరులో కడపను చేర్చాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఎన్టియు కార్యాలయంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి. చంద్ర అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రంగా కడప ఏర్పడి 200 సంవత్సరాలైందని, 20 సంవత్సరాల కిందట మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్. రాజశేఖర్ రెడ్డి దిశతాబ్ది ఉత్సవాల పేరుతో కడప చరిత్ర సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేశారని పేర్కొన్నారు. ఆయన మరణానంతరం కడప పేరును తొలగించి చరిత్ర ఆనవాళ్లే లేకుండా చేయడం చారిత్రక తప్పిదమని తెలిపారు. జిల్లా పేరులో తిరిగి కడపను చేర్చి తప్పిదాన్ని సరిదిద్దాలని వారు డిమాండ్ చేశారు. ఒక పరిపాలనా కేంద్రంగా కడపకు 200 ఏండ్ల గుర్తింపు ఉన్నా నిజానికి చరిత్రలో కడప అనే పేరు శతాబ్దాల నుంచి ఉనికిలో ఉందని పేర్కొన్నారు. ఇక్కడి ప్రజల విశ్వాసాలు, మెకంజీ కైఫీయత్తుల ప్రకారం కడప అంటే వెంకటేశ్వరుని గడప, కచ్చితమైన చారిత్రక ఆధారం ప్రకారం క్రీ. శ. 971 నాటికే 'కడప' ప్రాదేశిక విభాగంగా ఉనికిలో ఉన్నట్లు వైదుంబ రాజువంశానికి చెందిన భువన త్రినేత్ర అనే రాజు అత్తిరాలలో వేయించిన రాగిశాసనం ద్వారా తెలుస్తోందని తెలిపారు. కడప జిల్లా ఒకప్పటి మద్రాసు ప్రెసిడెన్సీలోని రాయలసీమలో అతిపెద్ద ప్రాంతం అన్నారు. బళ్లారి సరిహద్దుల నుంచి ఇప్పటి అనంతపురం, చిత్తూరు, కర్నూలు, ప్రకాశంజిల్లాల్లో చాలా ప్రాంతాలు ఒకప్పుడు కడపజిల్లాలో భాగమే అన్నారు. ఇక్కడ సకల వెనుక బాటుతనాలతోపాటు గొప్ప దేశీయ సంప్రదాయాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇంతటి అస్తిత్వంగల పేరును ఇప్పుడు మార్చాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. కొత్తగా ఏర్పడే ప్రాంతాలకైతే ప్రజల మనోభావాల్లో గూడుకట్టుకున్న మనుసుల పేర్లు పెట్టవచ్చునేమోగాని ఉన్న పేరుమార్చి మనిషి పేరు పెట్టడం ఎంత సముచితం అని పేర్కొన్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ ప్రాంతానికి సంబంధించిన వేయి సంవత్సరాలు పైబడిన చరిత్ర, సంస్కృతి, పోరాటాల సారం 'కడప' అన్న అక్షరాల్లో వ్యక్తమవుతుంటుందన్నారు. 2005లో ఆంగ్లంలో ఉన్న కుడప్ను కడపగా మార్చారని, 2009లో హెలికాప్టర్ ప్రమాదంలో వైయస్సార్ మరణానంతరం భావోద్వేగాల నడుమ 2010, ఆగస్టు 7న కడప జిల్లా పేరునువైఎస్ఆట్ జిల్లాగా మార్చడం పట్ల పార్టీ, ప్రజా సంఘాలు వ్యతిరేకించినప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. అయితే అధికారులు అధికారిక ప్రకటనలు వైఎస్ఆర్ కడప జిల్లాగా పరిగణిస్తూ రావడం, 2019లో జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక నూతన జిల్లాల ఏర్పాటులో వైఎస్ఆర్ జిల్లా పేరులో కడప లేకపోవడం పట్ల జిల్లా ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వైఎస్ఆర్జిల్లా పేరులో కడప ను చేర్చాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసిందని తెలిపారు. దీని కోసం కలెక్టర్ను, ముఖ్యమంత్రిని కలిసి వినతి పత్రాలు సమర్పించి తదుపరి కార్యాచరణ ప్రకటించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ ఎన్.తులసిరెడ్డి, టిడిపి రాష్ట్ర నాయకులు బి.హరి ప్రసాద్, సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, చేతి వృత్తిదారుల జాతీయ సమాఖ్య అవ్వారు మల్లికార్జున, ఆప్ డాక్టర్ శ్రీనివాసులు, విరసం వరలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ సత్తార్, రైతు స్వరాజ్య వేదిక శివారెడ్డి, అభ్యుదయ వేదిక శంకరయ్య, జన విజ్ఞాన వేదిక విశ్వనాథ్ హాజరయ్యారు. సిపిఐ, సిపిఎం నగర కార్యదర్శి ఎన్.వెంకట శివ, రామ్మోహన్, రైతు సంఘం ఎం.వి.సుబ్బారెడ్డి, మహిళా సమాఖ్య బస్సురునిసా, ఎఐటియుసి బాదుల్లా, సిపిఐ సీనియర్ నాయకులు సావంత్ సుధాకర్, ప్రజానాట్యమండలి పల్లవోలు రమణ, డి హెచ్ పి ఎస్.మునయ్య, ఇమ్మానియేల్, ఏఐవైఎఫ్ దస్తగిరి, ఏ ఐ ఎస్ ఎఫ్ వలరాజు, శివశంకర్, గిరిజన సమాఖ్య బ్రహ్మం పాల్గొన్నారు.

పద్మశాలి ఉద్యోగుల సంఘం

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- కడప అర్బన్ : కడప చిన్నచౌకు పద్మశాలి భవన్లో కడప పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నికల అధికారిగా కొంతం శివ రుద్రప్ప, ఎన్నికల పరిశీలకులు డాక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఏకగ్రీవం అయ్యింది. మరో మారు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులు (పాఠశాల విద్య శాఖ కడప), ప్రధాన కార్యదర్శి డాక్టర్ చుప్పల విజయకుమార్ (వెటర్నరీ కళాశాల, ప్రొద్దుటూరు), కోశాధికారిగా అవ్వారు రమేష్ (పాఠశాల విద్య, కడప) ఎన్నికయ్యారు. మహిళా విభాగం అధ్యక్షురాలుగా డాక్టర్.జనపాటి వెంకట లక్ష్మీ (ప్రిన్సిపాల్), ప్రధాన కార్యదర్శిగా అనిత (లెక్చరర్), చెన్నా విజయలక్ష్మి (పాఠశాల విద్య) ఎంపిక అయ్యారు. రాష్ట్రశాఖ ప్రతినిధిగా సోము జ్ఞానశంకర్ (రిటైర్డ్ లెక్చరర్, ప్రొద్దుటూరు) ఉపాధ్యక్షులు వద్ది మాధవ, తిరుమల కొండు, సహాయ కార్యదర్శులు లోకేష్, గాజుల మల్లి ఖార్జున, నల్లి పవన్ కుమార్, కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ వెంకట సుబ్బయ్య, క్రిష్ణయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ పద్మశాలీ ఉద్యోగుల సంక్షేమం, సమస్యల సాధనకు తనవంతు సహకారం ఉంటుందన్నారు. సమాజ నిర్మాణంలో, దేశాభివృద్ధికి ఉద్యోగులందరూ తోడ్పడాలని కోరారు.



ఎన్నికైన పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

విభిన్న ప్రతిభావంతుల పక్షపాతి చంద్రబాబు

ప్రజాశక్తి - బద్వేలు : చంద్రబాబు నాయుడు విభిన్న ప్రతిభావంతుల పక్షపాతి అని బద్వేల్ టిడిపి యువ నాయకులు రితీష్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం విభిన్న ప్రతిభావంతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఇండ్ల ఓబులేసు ఆధ్వర్యంలో పట్టణంలోని బాలుర హైస్కూల్లో అభినందన సభ, ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగాబద్వేల్ టిడిపి యువ నాయకులు రితీష్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు వెంగల్ రెడ్డి, బొమ్మన విజయ్, బద్వేల్ అసెంబ్లీ కన్వీనర్ బిజి వేముల భాస్కర్ రెడ్డి, జనసేన నాయకులు మురళి కృష్ణ, బసవి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలోనూ ప్రస్తుతం విభిన్న ప్రతిభావంతుల అభివృద్ధిని కోరుకుంటూ పింఛను పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. రాష్ట్ర ప్రగతిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రజలు మరో మారు చంద్రబాబును ముఖ్యమంత్రి చేసినందుకు సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రాగిమాను ప్రతాప్, రామాంజనేయ నాయుడు, లాయర్ ప్రసాద్, బాయ్స్ హైస్కూల్ హెడ్మాస్టర్ వెంకటసుబ్బారెడ్డి, వెంకటసుబ్బయ్య, బద్వేలు బలిజ సంఘం అధ్యక్షులు డివి, నాయకులు చిన్న సుబ్బారావు, ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు జాండవరం వెంకటసుబ్బయ్య, డి వెంకటేశ్వర్లు, జనసేన రాయలసీమ జోన్ 1 కమిటీ సభ్యులు తోట బాలచంద్రుడు, అధిక సంఖ్యలో విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రితీష్రెడ్డి

ఆరు నెలలు ఆగండి.. పోరాటం చేద్దాం

- వైసిపి కౌన్సిలర్లతో మాజీ సిఎం వై.ఎస్. జగన్
- జగన్ను కలిసేందుకు పోటెత్తిన జనం
- ప్రజాదర్బార్లో బిజీ బిజీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

'ప్రజలకు మేలు చేశాం.. మన ప్రభుత్వం వస్తుంది.. అధైర్య పడకండి.. ఆరు నెలలు ఆగండి..పోరాటం చేద్దాం' అని మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్రెడ్డి వైసిపి నాయకులు, మున్సిపల్ కౌన్సిర్లతో అన్నారు. జిల్లాలో మూడు రోజుల పర్యటనలో భాగంగా రెండో రోజు ఆదివారం పట్టణ పరిధిలోని తన కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిలర్లు, వైసిపి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు నెలల వరకు ఆగండి ప్రభుత్వం ఏం చేస్తుందో వేచి చూద్దాం తర్వాత ప్రజా సమస్యలపై పోరాటాలు చేద్దామని చెప్పారు. తాను ఎప్పటికీ అందుబాటులో ఉంటానని అధైర్య పడకుండా ముందుకెళ్దామని వారికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు తమపై జరుగుతున్న దాడుల గురించి వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లారు. వివరించారు. అలాగే పట్టణంలో పలు పనులు ఇంకా పెండింగ్ ఉన్నాయని, చేసిన వాటికి కొంతవరకు బిల్లులు రావాల్సి ఉందని ఆయనకు, వాటిని వచ్చేలా ఆయనకు విన్నవించారు. దీనికి ఆయన స్పందిస్తూ గత ప్రభుత్వంలో నీరు చెట్టు కింద చేసిన పనులకు సంబంధించి పెండింగ్ ఉన్న బిల్లులను న్యాయస్థానానికి వెళ్లి తెప్పించుకున్నామని, అదే బాటలోనే మనం పోరాడుదామని ముఖ్య కార్యకర్తలకు హామీ ఇచ్చారు.



కౌన్సిలర్లు, ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న జగన్

సార్..మాకు ఏమి చేయలేదు : కౌన్సిలర్లు

అధికారంలో ఉన్న ఐదేళ్లు తమకు ఏమీ మేలు జరగలేని మున్సిపల్ కౌన్సిలర్లు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డికి మొరపెట్టుకున్నారు. ఇందుకు జగన్ స్పందిస్తూ పులివెందుల అభివృద్ధి కోసం కోట్ల రూపాయలు మంజూరు చేశామని, మీరు చూస్తే ఏమి జరగలేదని అంటున్నారు.. ఏమిటని అన్నారు. దీనికి వారు స్పందిస్తూ 33 మందిలో ఆరుగురికి మాత్రమే మేలు జరిగిందని వాపోయారు. నిజమా అంటూ ముఖ్య నేతలపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తుంది.

ప్రజాదర్బార్కు పోటెత్తిన జనం..

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిసేందుకు జిల్లాలోని నలుమూలల నుంచి జనం పోట్టెత్తారు. పులివెందుల పర్యటనలో భాగంగా రెండో రోజు ఆదివారం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజాదర్బార్ నిర్వహించారు ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలు తెలుసుకున్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి పులివెందులలో ఉన్న విషయం తెలుసుకున్న ఉమ్మడి జిల్లాలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచారు. జగన్ కలిసేందుకు గంటల తరబడి సమయం పట్టిన ఓపికగా క్యూలో నిలబడి కలిసి వెళ్లారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు టిడిపి నాయకుల ఆగడాల గురించి జగన్ దృష్టికి తీసుకువెళ్లారు. ప్రజలు ఇచ్చిన వినతులను స్వీకరిస్తూ ఆప్యాయంగా పలకరిస్తూ సెల్ఫీలు దిగారు. సమస్యలపై పోరాటం చేద్దామని ఎవరు నిరుత్సాహపడకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలన్నారు.

జిల్లా ముఖ్య నేతలతో సమీక్ష

ఉమ్మడి జిల్లా ముఖ్య నేతలతో వై.ఎస్. జగన్మోహన్రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓటమికి గల కారణాలను, వైసిపి నాయకులు, కార్యకర్తలు పడుతున్న ఇబ్బందుల గురించి ఆరా తీసినట్లు తెలుస్తుంది. నియోజకవర్గాలలో అందుబాటులో ఉండి నాయకులలోను, కార్యకర్తలలోను ఉత్సాహాన్ని, ధైర్యాన్ని నింపాలన్నారు. ఆరు నెలల వరకు వారు ఇచ్చిన వాగ్దానాలు ఏ మేరకు అమలు చేస్తారో వేసి చూద్దాం తర్వాత కార్యాచరణ ప్రకటిద్దామని నాయకులతో అన్నట్లు తెలుస్తుంది. కార్యక్రమంలో రాజంపేట శాసనసభ్యుడు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, జిల్లాలోని వైసిపి నాయకులు, నియోజకవర్గంలోని వివిధ మండలాల జడ్పిటిసిలు, మండల అధ్యక్షులు, ఎంపిటిసి, సర్పంచులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

మా సమస్యలు జగన్మోహన్రెడ్డికి చెప్పండి

-వై.ఎస్ భారతికి మహిళా కౌన్సిలర్ల విన్నపం

పట్టణంలో జరిగిన అభివృద్ధిలో కేవలం కొంతమందికి మాత్రమే లబ్ధి చేకూరిందని, టిడిపి నాయకుల ఆగడాలు ఎక్కువయ్యాయని వీటిని జగన్మోహన్రెడ్డి చెప్పాలని మహిళా కౌన్సిలర్లు వై.ఎస్. భారతి కలిసి తమ బాధను వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలోని తన పార్టీ కార్యాలయంలో వైయస్ జగన్మోహన్రెడ్డి కౌన్సిలర్ సమావేశం అనంతరం మహిళా కౌన్సిలర్లు వైఎస్ భారతితో మాట్లాడారు. పులివెందుల మున్సిపాలిటీకి 33 మంది కౌన్సిలర్లు ఉండగా కేవలం ఒక ఆరుగురు మాత్రమే మద్ది పొందారని మిగిలినవారంతా చాలా బాధలు పడుతున్నామని చెప్పారు. కౌన్సిలర్గా ఉండి పిల్లల చదువులు కూడా చదివించుకోలేని పరిస్థితిగా నెలకొందని వాపోయారు. పేరుకు మాత్రమే కౌన్సిలర్గా మిగిలిపోయామని ఎన్ని బాధలు వచ్చినా, ఎన్ని కష్టాలు వచ్చినా, తాము జగన్మోహన్ రెడ్డి వెంటనే ఉంటామని, ప్రాణం ఉన్నంతవరకు వైసిపికి కోసమే పోరాడుతామని చెప్పారు. ఈ విషయాలను జగన్మోహన్రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి తమ న్యాయం చేసే విధంగా చూడాలని వారు వైఎస్. భారతిని వేడుకున్నారు.



వై.ఎస్.భారతితో మాట్లాడుతున్న మహిళా కౌన్సిలర్లు



సమావేశంలో మాట్లాడుతున్నసిపిఎం నాయకులు

తాగునీటి సమస్యను పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - బద్వేలు : బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని వార్డులలో నెలకొన్న మంచినీటి సమస్య పరిష్కరించాలని, లేని పక్షంలో తీవ్రమైన పోరాటం చేపడుతామని సిపిఎం బద్వేల్ పట్టణ కార్యదర్శి కె.శీను డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని అధ్యక్షతన ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశం ఉద్దేశించి సిపిఎం పట్టణ కార్యదర్శి శీను మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డులలో తీవ్రమైన నీటి సమస్య ఉందని వాటిని పరిష్కరించడంలో మున్సిపాల్టీ పాలకవర్గం, అధికారులు విఫలమయ్యారని వారు తెలిపారు. సుందరయ్య కాలనీ, ఐలమ్మ కాలనీ, జ్యోతి బస్ కాలనీ, నూర్ బాషా కాలనీ, రిక్షా కాలనీ, మార్తమ్మ నగర్, సుమిత్రా నగర్లలో ఐదు నుంచి ఏడు రోజులకు ఒక మారు మాత్రమే నీటి సరఫరా చేస్తున్నారని, ఇక్కడ తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. అనేక దఫాలుగా అధికారులకు చెప్పినా ఫలితం లేదని, సుందరయ్య కాలనీలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని గతంలో ఉన్నటువంటి మున్సిపల్ కమిషనర్ బోరు వేశారని, కానీ ఇంతవరకు కనెక్షన్ ఇచ్చినటు పాపాన పోలేదని వాపోయారు. అలాగే కొన్నిచోట్ల బ్రహ్మం సాగర్ నుంచి మంచినీటి పైపులను కూడా సక్రమంగా వేయలేదని అనేక దపాలుగా అధికారులకు తెలియజేసినప్పటికీ వారు మాటలతో ప్రజలను మభ్య పెడుతున్నారని పేర్కొన్నారు. నీటి సమస్య తీవ్రంగా ఉన్నచోట అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కమిషనర్ మాత్రం డబ్బులు లేదని ట్యాంకర్లు డీజిల్ పోసుకునే స్థోమత కూడా లేదని సమాధానాలు చెబుతున్నారని పేర్కొన్నారు. తాగడానికి నీళ్లు లేక ప్రజలు ఇబ్బంది పడుతుంటే బ్రహ్మ సాగర్ నుంచి సెంచరీ ప్లైవుడ్ ఫ్యాక్టరీకి ప్రత్యేక పైప్లైన్ ద్వారా నీరందించడం ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు స్పందించి మున్సిపాలిటీలోని వార్డులలో మంచినీటి సరఫరా సరిచేయాలని, లేనిపక్షంలో మున్సిపాలిటీలో ఉన్నటువంటి ప్రజలతో కలిసి సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు మోక్షమ్మ బ్రహ్మయ్య అనంతమ్మ డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి గంగనపల్లి నాగార్జున ఉపాధ్యక్షులు ఉప్పులూరి ఆంజనేయులు, ఇమ్మానీలు జి రమణ, మల్లికార్జున, డివైఎఫ్ఐ మహిళా కో కన్వీనర్ నాగలక్ష్మి, మహిళా ఐద్వా సంఘం నాయకురాలు బాలమ్మ, మస్తాన్ బి, ఖాదర్ బి, కైరున్ బి, రామలక్ష్మమ్మ సిఐటియు పట్టణ కోకన్వీనర్ పీసీ కొండయ్య, రాయప్ప నాగమ్మ పాల్గొన్నారు.

'అయ్యన్న'కు స్పీకర్ పదవి సమర్ధనీయం

ప్రజాశక్తి - కడప అర్బన్ : తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి కరుడు కట్టిన తెలుగుదేశం పార్టీ నాయకుడిగా పార్టీ కష్టాల్లో ఉంటే వెన్నుచూపక పోరాటం చేసిన నాయకుడు చింతకాయల అయ్యన్న పాత్రుడికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్గా నియమించడం సమర్థతకు పట్టం కట్టినట్టుందని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ అక్బర్ అన్నారు. ఆదివారం పాత బస్టాండ్లోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాజకీయల్లో 7 సార్లు ఎమ్మెల్యేగా,1 సారి ఎంపీగా, నాలుగు సార్లు మంత్రిగా, పొలిట్ బ్యూరో సభ్యునిగా కొనసాగడం అంటే ఒక చరిత్ర అన్నారు. అసెంబ్లీని సజావుగా నడిపించి, ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారి వారి నియోజకవర్గాల ప్రజల కష్ట నష్టాలు కావాల్సిన సౌకర్యాలు, మంచి ప్రశాంత వాతావరణం కల్పించి చర్చ జరిగే విధంగా అవకాశం కల్పించి సభా మర్యాదలను, సాంప్రదాయమును కాపాడుతారన్నారు. మళ్ళీ అసెంబ్లీలో పాతకాలం సమావేశాలు మాదిరి జరిగి ప్రజల మన్ననలు పొందే విదంగా సాగుతాయని పేర్కొన్నారు.

మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలి

ప్రజాశక్తి- కడప అర్బన్



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్యామ్ సుందర్రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ. శ్యాం సుందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఎపిటిఎఫ్ కార్యాలయంలో జిల్లా సబ్ కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ పిఆర్సిలో అమలులో జాప్యం జరిగే అవకాశం ఉంది కావున వెంటనే మధ్యంతర భృతిని ప్రకటిచాలన్నారు. 11వ పిఆర్సిలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు తీవ్రంగా నష్టపోయారన్నారు. 12వ పిఆర్సిని మెరుగైన ఫిట్ మెంట్తో ప్రకటించాలన్నారు. 11వ పిఆర్సి బకాయిలను, కరువుబత్యం బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. సరెండర్ లీవు బకాయిలను,ఎ పిజియల్ఐ బకాయిలను చెల్లించాలన్నారు. ప్రాథమిక పాఠశాలల నుంచి 3,4,5 తరగతులను విభజించి ఉన్నతపాఠశాలలలో విలీనంచేయడం వల్ల ప్రాథమిక పాఠశాలలు నిర్వీర్యం అయ్యాయని తెలిపారు. దానికి కారణమైన జిఒ 117ను రద్దుచేయాలన్నారు. ప్రభుత్వపాఠశాలలలో చదివే విద్యార్థుల తల్లులకు మాత్రమే తల్లికి వందనం పథకం కింద రూ.15వేలు చెల్లించాలన్నారు. ప్రభుత్వపాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగుమాధ్యమాన్ని కూడా సమాంతరంగా కొనసాగించాలన్నారు. ఉన్నతపాఠశాలలలో సిబిఎస్సి, ఐబి సిలబస్లనురద్దు చేయాలన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలలు లేకుండా ప్రతి ప్రాథమిక పాఠశాలకు కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి ఉన్నతపాఠశాలలో ప్రధానోపాధ్యాయుని, వ్యాయా మోపాధ్యాయుని పోస్టులను మంజూరుచేయాలన్నారు. బోధనకు ఆటంకం కలిగించే అనవసర యాప్లను రద్దుచేసి ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై ముఖ్యమంత్రి ఉద్యోగ సంఘాలతో చర్చించాలన్నారు. సమావేశంలో ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్సులు ఖాదర్ బాష, శ్రీనివాసరెడ్డి, రాష్టకౌన్సిలర్లు కృష్ణారెడ్డి, గురయ్య, భాస్కరరెడ్డి, జిల్లాకార్యదర్సులు రామ్ భూపాల్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బాలజ్యోజి, అబ్దుల్ సత్తార్, జిల్లాకౌన్సిలర్లు ఆదిశేషారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, శేషారెడ్డి పాల్గొన్నారు.

బిసిల రాజకీయ చైతన్యం టిడిపితోనే సాధ్యం

ప్రజాశక్తి - బద్వేలు

బిసిల రాజకీయ చైతన్యం టిడిపితోనే సాధ్యమని పూలే ఆశయ సాధన సమితి చైర్మన్ బద్వేల్ గురుమూర్తి, వైస్ చైర్మన్ యు. వెంకటరమణ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం పూలే సావిత్రిబాయి, పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస యాదవ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గురుమూర్తి మాట్లాడుతూ నాటి ఎన్టి రామారావు నుంచి నేటి చంద్రబాబు నాయుడు పాలన వరకు తెలుగుదేశం పార్టీ బిసిల రాజకీయ చైతన్యం, పాలనలో భాగస్వామ్యం కల్పించిందని చెప్పారు. బి.సిల సమస్యలు, అభివృద్ధి పట్ల అవగాహన ఉన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అపరిష్కృతంగా ఉన్న బి.సి ల న్యాయమైన కోరికలు అన్నీ నెరవేరుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన మొల్ల సాహితీ పీఠం అధ్యక్షులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత గానుగపెంట హనుమంతరావు మాట్లాడుతూ జనాభాలో 50 శాతం ఉన్న బిసి అన్నిరంగాలలో ముఖ్యమంత్రి చంద్రబాబును నాయుడు పాలనలో అభివృద్ధి జరుగుతుందని, తెలుగుదేశం పార్టీ అంటే బిసిల పార్టీ అని ఆ పార్టీ అధికారంలోకి రావడం ప్రజల అదృష్టం అని కొనియాడారు. కార్యక్రమంలో యు.వెంకటరమణ యాదవ్, జె.సింగరయ్య యాదవ్ రాష్ట్ర యాదవ సంఘం సెక్రటరి, బి.సి సంఘం నాయకులు కె.సింగరయ్య, ఎస్.ఎన్ సుబ్బరాయుడు, రాష్ట్ర బి.సి సంఘం నాయకులు టి.రామసుబ్బయ్య యాదవ్, రామనబోయిన తిరుపాలు యాదవ్, యం.బాలయ్య యాదవ్,కె.చంద్ర యాదవ్, వాకా వాసు యాదవ్, ఆవుల వెంకటసుబ్బయ్య యాదవ్ పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్లతో సిఐటియు పట్టణ అధ్యక్షులు ఏసుదాసు

ఆటో డ్రైవర్లకు అండగా ఉంటాం : సిఐటియు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

గూడెంచెరువు రాజీవ్ కాలనీ ఆటో డ్రైవర్లకు అండగా ఉంటామని సిఐటియు పట్టణ అధ్యక్షులు ఏసుదాసు తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ అధ్యక్షులు జి ఏసుదాసు మాట్లాడుతూ ఏ సమస్య వచ్చినా సిఐటియు అండగా ఉంటుందన్నారు. అనంతరం విస్తృత సమావేశంలో అనేక సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో జమ్మలమడుగు మున్సిపల్ కార్యదర్శి శేఖర్, అధ్యక్షులు నాగన్న, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పేద, బడుగు, బలహీన వర్గాల వారికి ఉచిత వైద్య సేవలు ఎంతగానో ఉపయోగపడుతాయని రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ మురళీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో ఉన్న సాయి పరమేశ్వర డిగ్రీ కళాశాలలో రోటరీ క్లబ్ జమ్మలమడుగు ఆధ్వర్యంలో శాంతిరామ్ కంటి హాస్పిటల్ వైద్య బృందం సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ రోటరీ క్లబ్ ద్వారా జమ్మలమడుగు, దాని పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు ఉచితంగా కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసి వారికి కంటి ఆపరేషన్లు ఉచితంగా చేయించడం మా ధ్యేయమన్నారు. రోటరీ కార్యదర్శి శివ గణపతి, రోటరీ క్లబ్ మెంబర్, ముద్దనూరు ఎఒ మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ రోటరీ క్లబ్ సేవకు ప్రతి రూపమన్నారు. కార్యక్రమంలో శాంతిరామ్ హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ నాగార్జున మాట్లాడుతూ రోటరీ సంస్థ ద్వారా కలిసి పేద ప్రజలకు రూపాయ ఖర్చు లేకుండా ఉచితంగా కంటి పరీక్షలు, ఆపరేషన్ చేయడం తమవంతు అని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు, పెద్దలు నాగేశ్వరరెడ్డి, కుండా భాస్కర్, ఓబులరెడ్డి, సంజీవ రాయుడు, శ్రీనివాసులు, సభ్యులు, ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొన్నారు.

అతిసారను అరికట్టండి : తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలో దాదాపు అన్ని జిల్లాల్లో అతిసార వ్యాధి రోజురోజుకూ ఎక్కువైందని, ఈ వ్యాధిని అరికట్టాలి పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అతిసార వ్యాధితో వచ్చే రోగులతో ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయన్నారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో అతిసార వ్యాధితో నలుగురు చనిపోయారని తెలిపారు. 40 మంది చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం జొన్నల దొడ్డిలో ఒకరు మరణించగా 36 మంది చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. చిన్న పిల్లల్లో అతిసార ప్రాణాంతకమన్నారు. తాగునీటి పైపులు లీకేజీ కావడం, డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో అతిసార సోకుతుందని తెలిపారు. ప్రభుత్వం సురక్షితమైన తాగునీటి సరఫరాపై శ్రద్ధ వహించాలని కోరారు. ఓఆర్ ప్యాకెట్లు, సెలెన్ బాటిళ్లు కొరత లేకుండా జాగ్రత్త వహించాలని కోరారు.

ప్యాక్‌హౌస్‌లో చోరీ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని బలపనూరుకు చెందిన హరి అనే రైతు పొలంలోని ప్యాక్‌హౌస్ తాళాలు పగలగొట్టి చోరీ చేశారు. ఆదివారం రైతు తమ పొలం వద్దకు పోయేసరికి రూము తలుపుల తాళం పగలగొట్టి ఉండడాన్ని గమనించాడు. సింహాద్రిపురం-పులివెందుల ప్రధాన రోడ్డు మార్గం పక్కలోనే ఈ సంఘటన జరగడం పట్ల రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రూములోనే వ్యవసాయానికి సంబంధించిన పలు యంత్ర పరికరాలు చోరీకి గురయ్యాయి. గతంలో అగ్రహారంలో ఇదే సంఘటన జరిగింది. పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో సెక్యూరిటీ గార్డు మృతి

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రిపుల్‌ఐటి సెక్యూరిటీ గార్డు ఎద్దుల రాజీవ్ ప్రసాద్ (32) మృతి చెందాడు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాల్లోకి వెళితే.. వేంపల్లెలోని ఉషాకిరణ్ పాఠశాల సమీపంలో నివాసం ఉంటున్న రాజీవ్ ప్రసాద్ ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటిలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం నిర్వహించేందుకు మోటర్ బైకులో రాజీవ్ ప్రసాద్ వెళుతుండగా ట్రిపుల్‌ఐటి సమీపంలోని వైఎస్ఆర్ ఘాట్ సమీపంలో మోటర్ బైకు అదుపు తప్పి గుంతలో పడినట్లు తోటి సిబ్బంది తెలిపారు. మోటర్ బైకు నుండి కింద పడిన రాజీవ్ ప్రసాద్‌కు తీవ్ర రక్త గాయాలయ్యాయి. కొద్దిసేపటికి తర్వాత రోడ్డు ప్రమాద విషయాన్ని డ్యూటీకి వెళుతున్న ట్రిపుల్‌ఐటి సిబ్బంది 108కు సమాచారమిచ్చారు. వేంపల్లెలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బంధువులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకొని మెరుగైన చికిత్స కోసం కడప తరలించేలోపు మృతి చెందాడు. రాజీవ్ ప్రసాద్‌కు తల్లిదండ్రులతోపాటు భార్య గీత ఉంది. గీత గర్భవతి అని బంధువులు తెలిపారు. రాజీవ్ ప్రసాద్ మృతి విషయం తెలుసుకున్న తోటి సెక్యూరిటీ గార్డు, సిబ్బంది ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆర్కే వ్యాలీ పోలీసులు తెలిపారు.

మృతదేహాన్ని సందర్శించిన తులసిరెడ్డి

ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటిలో పని చేస్తున్న సెక్యూరిటీ గార్డు రాజీవ్ ప్రసాద్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి ఆసుపత్రిలో ఉన్న రాజీవ్ ప్రసాద్ మృతదేహాన్ని సందర్శించారు. రోడ్డు ప్రమాద ఘటనపై బంధువులను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని తల్లిదండ్రులను ఓదార్చారు.



మృతి చెందిన రాజీవ్ ప్రసాద్

రాయితీ పైపుల లబ్ధిదారుల్లో ఆందోళన

డిడిలు చెల్లించినా.. నేటికీ రాని పైపులు-పాడా నిధులు కావడంతో అనుమానం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

గత ప్రభుత్వం పులివెందుల డెవలప్మెంట్ అథారిటీ(పాడా) ఆధ్వర్యంలో రైతులకు రాయితీతో పివిసి పైపులను అందించేందుకు అర్హత కలిగిన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మండల వ్యాప్తంగా 933 మంది రైతులు పివిసి పైపుల నిమిత్తం దరఖాస్తు చేసుకున్నారు. గత ప్రభుత్వ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సొంత నియోజవర్గం కావడంతో పులివెందుల డెవలప్మెంట్ అథారిటీ పేరుతో రైతులకు పివిసి పైపులు ఇవ్వడానికి అధికారులు శ్రీకారం చుట్టారు. అయితే వ్యవసాయ శాఖ అధికారులు అక్టోబర్ నెలలో పత్రికాముఖంగా ప్రకటన జారీ చేయడంతో చాలామంది రైతులు ఆసక్తి చూపారు. ప్రభుత్వం ఒక్కో లబ్ధిదారుడికి రూ.10వేలు రాయితీని ఇచ్చింది. దీంతో బయటి మార్కెట్ కంటే ప్రభుత్వం అందజేస్తున్న పైపులు ధరలు తక్కువగా ఉండడంతో మండల వ్యాప్తంగా రైతులు వాటిని కొనేందుకు ముందుకు వచ్చారు. మొదటి, రెండు విడతల్లో రాయితీ సొమ్ము పోనూ మిగిలిన డబ్బులకు సంబంధించి డీడీలు అందజేసిన రైతులకు పైపులు అందించారు. చివరగా డీడీలు చెల్లించి దరఖాస్తు చేసుకున్న 208 మంది రైతులకు నేటికీ పైపులు రాకపోవడంతో వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

పాడా నిధులు కావడంతో రైతుల్లో సర్వత్రా ఉత్కంఠ..

గత ప్రభుత్వం పాడా నిధులతో రైతులకు పివిసి పైపులు పంపిణీ చేసింది. మిగిలిన రైతులకు నేటికీ పైపులు అందకపోవడంతో వారిలో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. గతంలోని వైసిపి ప్రభుత్వం ఎన్నికల అనంతరం మళ్లీ అధికారంలోకి రాకపోవడంతో పాడా నిధులు వస్తాయా.. రావా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. డీడీలు చెల్లించి ఏడు నెలలు పూర్తయినా రాకపోవడం పట్ల రైతులు తీవ్ర మానసిక ఆవేదనకు గురవుతున్నారు. అధికారులు, ప్రస్తుత పాలకులు స్పందించి పైపులు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు తెలియజేశాం..

గత ప్రభుత్వ హయంలో మండల వ్యాప్తంగా అర్హత కలిగిన రైతులకు పీవీసీ పైపులను అందజేశాం. ఇంకా కొంతమందికి పైపులు ఇవ్వలేదు. వీరి వివరాలను అధికారులకు తెలియజేశాం. వారి ఆదేశాల మేరకు త్వరలోనే చర్యలు తీసుకుంటాం.

- శివమోహన్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి, సింహాద్రిపురం



గతంలో పంపిణీ చేసిన పైపులు

విచ్చలవిడిగా విదేశీ సిగరెట్లు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల నియోజకవర్గంలో ఏ అంగడిలో చూసినా విదేశీయ సిగరెట్లు దర్శనమిస్తూనే ఉన్నాయి. కొంతమంది వ్యాపారస్తులు పులివెందులలో వీటిని చిల్లర అంగళ్లకు భారీగా రవాణా చేస్తున్నారు. ప్రభుత్వ నిషేధిత విదేశీయ కొన్ని సిగరెట్లు తదితర రకాల పేర్లతో ఎలాంటి అనుమతులు లేకుండా వాటిని తెప్పించుకొని ప్రజల ప్రాణాలను హరింపజేస్తూ.. లక్షల రూపాయలు గడిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొన్ని కంపెనీ సిగరెట్లను బ్యాగులోపైన పెట్టుకుని అడుగుభాగమంతా ప్రభుత్వ నిషేధిత విదేశీయ సిగరెట్లు రవాణా అవుతున్నట్లు తెలుస్తోంది. ఇవి బజారులో క్రయవిక్రయాలు జరగకూడదని ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని బేఖాతరు చేస్తూ అంగళ్లకు రవాణా చేస్తున్నారు. కంపెనీ సిగరెట్ కొనాలంటే రూ.10, రూ.18 పెట్టాల్సి ఉంది. నిషేధిత సిగరెట్లను ఒక్కొక్కదాన్ని రూ.1, రూ.2తో కొనుగోలు చేస్తున్నారు. వీటిని తాగడం వల్ల ఆరోగ్యం దెబ్బతినే అవకాశాలు మెండుగా ఉన్నాయి. కంపెనీ సిగరెట్లు ఒక ప్యాక్ ధర రూ.100, రూ.180 ఉంది. ప్రభుత్వ నిషేధిత, మొదలగు సిగరెట్లు ప్యాక్ ధర రూ.20మాత్రమే. ఇవి కంపెనీ సిగరెట్లను పోలి ఉండడం, తక్కువ ధరకు దొరకడంతో అమ్మకాలు జోరుగా ఉన్నాయి. ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేసి రోజుకు రెండు మూడు ప్యాక్‌ల సిగరెట్లు కాలుస్తున్నారు. ఈ సిగరెట్ తాగడం వల్ల ఊపిరితిత్తులు పాడైపోవడం, గుండె సంబంధ వ్యాధులు వస్తాయని టివిల్లో, సినిమా థియేటర్‌లలో ప్రభుత్వం పబ్లిసిటీ చేస్తున్నప్పటికీ అమ్మేవారు పులివెందులలో ఎక్కువగా ఉన్నారు. అవి అమ్మకూడదని తెలిసినప్పటికీ విచ్చలవిడిగా వ్యాపారం చేస్తున్నారు. నిషేధిత సిగరెట్లు మార్కెట్లో తక్కువ ధరకు దొరుకుతుండడంతో విద్యార్థులు వాటికి బానిసలవుతున్నారు. పిల్లల ఆరోగ్యాలు పాడవుతాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 10, 15ఏళ్ల వారు ఈ సిగరెట్లను ఎక్కువ మోతాదులో సేవిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ నిషేధిత సిగరెట్ల అమ్మకాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కెసి కాలువకు వర్షపు నీరు విడుదల



ప్రజాశక్తి - చాపాడు

కడప-కర్నూలు (కెసి) ప్రధాన కాలువకు రాజోలి ఆనకట్ట నుండి వర్షపు నీటిని అధికారులు విడుదల చేశారు. మూడు రోజులుగా కాలువలో నీరు ప్రవహిస్తోంది. దీంతో వాగులు, వంకలకు నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం కెసి ప్రధాన కాలువలో వంద క్యూసెక్కులకు పైగా నీరు విడుదలైంది. కెసి కాలువకు నీరు విడుదల కావడంతో చుట్టుపక్కల గ్రామాల బోరు బావుల్లో నీటిమట్టం పెరిగింది. పశువులకు తాగునీటికి ఉపయోగకరంగా ఉంది. రజకులు తమ వృత్తి చేసుకునేందుకు అనువుగా నీరు లభ్యమవుతోంది. రాజోలి ఆనకట్ట వద్ద నీరు సమృద్ధిగా వర్షపునీరు ఉండడంతో కుందూ నదికి, కెసి కాలువకు నీరు అందుబాటులో ఉంది. పశువులకు మేతకు అవసరమైన గడ్డి జాతులను రైతులు సాగు చేస్తున్నారు.

గండి పూడ్చివేతలకు అధికారుల చర్యలు

మండల పరిధిలోని పల్లవోలు గ్రామ సమీపంలో రెండు రోజుల క్రితం కెసి ఉపకాలువకు గండి పడింది. ఈ విషయాన్ని రైతులు కెసి కెనాల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎఇ జాన్సన్ ఉన్నతాధికారులకు విషయాన్ని తెలిపి వారి ఆదేశాల మేరకు గండి పడిన ప్రదేశాన్ని పరిశీలించి మరమ్మతులు చేపట్టారు. జెసిబి యంత్రంతో గండి పూడ్చి సమస్యను పరిష్కరించారు. రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడుతుండడంతో కెసి కాలువకు నీరు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం కాలువకు రాజోలి ఆనకట్ట నుంచి వర్షపునీరు విడుదలైంది.



కాలువకు పడిన గండిని పూడ్చుతున్న అధికారులు

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



గొడుగులు అందజేస్తున్న వాసవి క్లబ్ సభ్యులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. వాసవి క్లబ్ ప్రెసిడెంట్ సగల మహేంద్ర బాబు, ఐఇసి శ్రీనివాస పవిత్రం, ఐపిసి నామ జనార్ధన్, ఆర్‌సి బల్స్ జనార్ధన్, జెసి నాగభూషణం వాసవి క్లబ్ సభ్యులతో కలిసి పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా స్థానిక సాయిబాబా దేవాలయం వద్ద వ్యాపారం చేసుకుంటున్న వర్తకులకు గొడుగులను పంపిణీ చేశారు. అనంతరం శ్రీ లక్ష్మీనరసింహస్వామి టెంపుల్ సమీపంలోని వాసవి కాలనీ పిల్లలకి పుస్తకాలు పంపిణీ చేశారు. విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులకు రేడియం జాకెట్‌లతోపాటు మాస్కులను అందజేశారు. స్థానిక అమ్మవారి శాలలో వాసవి క్లబ్ నూతన సభ్యులను చేర్పించిన సభ్యులకు, నేత్రదానం, అవయవ దానం చేసిన దాతలకు ఘన సన్మానం చేశారు. అనంతరం ఆలయ పరిసరాలను శుభ్రపరిచారు. చివరగా శ్రీ వాసవి ఫంక్షన్ హాల్‌కు 2000 లీటర్ల వాటర్ ట్యాంక్‌ను వాసవి క్లబ్ తరపున అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేయడం మనసుకు చాలా సంతోషాన్ని ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

దువ్వూరులో గాంధీ విగ్రహం ఆవిష్కరణ

దువ్వూరు : మండల కేంద్రమైన స్థానిక శ్రీ మరకత వాసవి కన్యక పరమేశ్వరి దేవస్థానంలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ప్రెసిడెంట్ దేవది ఉపేంద్ర ఆధ్వర్యంలో ఆదివారం డాన్‌డస్క్ అనే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం రోడ్డుపై వీధి వ్యాపారం చేసుకునే వారికి గొడుగులు, విద్యార్థులకు పుస్తకాలను, మరికొందరికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.




రూ.లక్షలు వెచ్చించారు.. ప్రహరీ నిర్మాణం మరిచారు

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని అభివృద్ధికి పెద్దపీట వేస్తోంది. వైద్య, విద్య ఆరోగ్య రంగాలకు పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తోంది. మండల పరిధిలోని పత్తూరు పంచాయతీ డాంఖాన్‌పల్లెలో లక్షలాది రూపాయలతో వైయస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ కేంద్రాన్ని నిర్మిం చారు. వైద్యం కోసం వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో వీటిని ప్రారంభించారు. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మాణ పనులు చేపట్టినా.. భవనాలకు రక్షణ లేకుండా పోయింది. ఆరోగ్య కేంద్రంలో ఉండే విలువైన పరికరాలకు రక్షణ లేదు. ప్రహరీ నిర్మించకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆస్పత్రి పరిసరాలన్నీ అపరిశుభ్రంగా మారుతున్నాయి. పశువులు సంచరిస్తూ అపరిశుభ్రంగా మారుస్తున్నాయి. ప్రహరీ నిర్మించి, ఆస్పత్రికి ముఖద్వారం ఏర్పాటు చేస్తే విలువైన పరికరాలకు రక్షణ ఉంటుందని పలువురు సూచిస్తున్నారు. పరిసరాలు శుభ్రంగా మారుతాయని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వైస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ కేంద్రానికి ప్రహరీ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రహరీకి నోచుకోని వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్ కేంద్రం



జగన్‌కు సమస్యలు చెబుతున్న సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు

మాజీ సిఎం జగన్‌ను కలిసిన సర్పంచ్ శ్రీను

ప్రజాశక్తి - వేంపల్లె

పులివెందులకు విచ్చేసిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డిని వేంపల్లె సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు కలిశారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా జగన్‌రెడ్డి పులివెందులకు విచ్చేశారు. ప్రజలు భారీ సంఖ్యలో మాజీ సిఎంను కలవడానికి తరలివచ్చారు. ఈ నేపథ్యంలో పులివెందులలోని తన ఇంట్లోనే జగన్ ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వేంపల్లె సర్పంచ్ రాచినేని శ్రీనివాసులుతో పాటు పలువురు వైసిపి నేతలు ఆయనను కలిసి సమస్యలను విన్నవించారు. ఇందుకు జగన్ సానుకూలంగా స్పందించారు. వైసిపి నేతలు ధైర్యంగా ఉండాలని సూచించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని కోరారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ సువర్ణదేవి తెలిపారు. ఆ మేరకు ఆదివారం ఆమె తహశీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ కార్యాలయంలో సోమవారం స్పందన(గ్రీవెన్స్‌సెల్) స్థానంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజలు, రైతులు నుంచి అందిన ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు చెప్పారు. సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆమె తెలిపారు.

దువ్వూరు : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ ఉమారాణి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో స్పందన కార్యక్రమం బదులుగా ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఉంటుందన్నారు. సమస్యలు ఏవైనా ఉంటే అర్జీల ద్వారా ప్రతి సోమవారం తమ కార్యాలయంలో ఇవ్వవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



తహశీల్దార్ ఉమారాణి

పులివెందుల రూరల్ : పులివెందుల తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహశీల్దార్ డివి రమేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి ప్రజలు తమ సమస్యలను అర్జీల ద్వారా తెలియజేయాలని కోరారు. అర్జీలను పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ కోరారు.

26న బహిరంగ వేలం

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు మేజర్ గ్రామ పంచాయతీకి సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ బస్టాండ్, జంతువధశాల, సులభ్ కాంప్లెక్స్‌కు ఈనెల 26న గ్రామ పంచాయతీలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆదివారం ఇఒపిఆర్‌డి వీరభద్రుడు తెలిపారు. బస్టాండ్‌కు రూ.2లక్షలు, జంతు వధశాలకు రూ.20వేలు, సులభ్ కాంప్లెక్స్‌కు రూ.వెయ్యి డిపాజిట్‌గా నిర్ణయించినట్లు తెలిపారు. ఆసక్తిగల వారు డిపాజిట్ చెల్లించి బహిరంగ వేలంలో పాల్గొనవచ్చని ఆయన తెలిపారు.

అంకాలమ్మ ఆలయంలో ప్రత్యేకపూజలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని అంకాలమ్మ గూడా రులో వెలసిన శ్రీఅంకాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున తమ మొక్కులు చెల్లించు కున్నారు.

విద్యుత్ అదాలత్‌తో సమస్యలు పరిష్కారం

నేడు ప్రొద్దుటూరు ఇఇ కార్యాలయంలో నిర్వహణ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు ఎర్రగుంట్ల డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిరణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారుల పరిష్కారం కాని సమ స్యలను రాతపూర్వక ఫిర్యా దు ద్వారా తెలియజేసి, వాటిని పరిష్కరించు కోవాలని కోరారు. ఈ ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమాన్ని సోమవారం ప్రొద్దు టూరులోని ఎగ్జి క్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సమస్యలున్న విని యోగదారులు సోమవారం ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు తమ ఫిర్యాదులను రాత పూర్వకంగా అందించాలని ఆయన సూచించారు.



కోలాటం వేస్తున్న చిన్నారులు

ప్రేక్షకులను అలరించిన చిన్నారుల నృత్యాలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం డాక్టర్ వైఎస్ఆర్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో చిన్నారులు చేసిన నృత్యాలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. శ్రీ యువరాజ్ డాన్సింగ్ స్కూల్ ఆధ్వర్యంలో చిన్నారులు ప్రదర్శించిన క్లాసికల్, జానపద, సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్, శిక్షకుడు యువరాజ్ పాల్గొన్నారు.

తేక్వాండో పోటీలకు ఇరువురు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఈ నెల 27, 28, 29, 30 తేదీల్లో నేపాల్ రాజధాని కాట్మండ్‌లో నిర్వహించనున్న అంతర్జాతీయ తేక్వాండో పోటీలకు ప్రొద్దుటూరుకు చెందిన ఇరువురు విద్యార్థులు ఎంపికయ్యారు. స్థానిక మునిపల్ వైవిఎస్ బాలికోన్నత పాఠశాలలోని జవహర్ బాల కేంద్రంలో మాస్టర్ మునీశ్వర్ శిక్షణలోని విద్యార్థులు తెక్వాండోలో విశేష ప్రతిభ కనబరుస్తున్నారు. 32 కిలోల సబ్-జూనియర్ క్యాట గిరీలో బొల్లవరం బ్రాంచ్‌లోని చైతన్య స్కూల్‌కు చెందిన 4వ తరగతి విద్యార్థి యం.సుదీప్, 55కిలోల సీనియర్ క్యాటగిరీలో శివకుమార్ ఎంపికయ్యారు. వీరు మరెన్నో విజయాలు సాధించాలని తేక్వాండో మాస్టర్ మునీశ్వర్, ప్రధానోపాధ్యాయుడు కాశీప్రసాద్‌రెడ్డి అభినందించారు.



ఎంపికైన సుదీప్